

సంకల్ప పూజలు
శ్రీకాళహస్తి: ముత్యాలమ్మ గుడి సమీపంలో శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధాలయమైన చక్రేశ్వరస్వామి బాలాలయ స్థాపనలో భాగంగా మంగళవారం సంకల్ప పూజలు నిర్వహించారు.



బాలాలయ స్థాపన
శ్రీకాళహస్తి: పొన్నాలమ్మ గుడి సమీపంలో శ్రీకాళహస్తీశ్వరాలయ అనుబంధ ఆలయమైన శ్రీ చెల్లేశ్వరస్వామి బాలాలయ స్థాపన కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.



అంతా రామ మయం
శ్రీకాళహస్తి : జిల్లాలో శ్రీరామనవమి ఉత్సవాలకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. రామమందిరాలను చలువ పందిళ్లు, విద్యుద్దీపాలంకరణలతో చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ బుధవారం(సా)	సహర్ గురువారం(ఉ)
తిరుపతి	6.27	4.52
చిత్తూరు	6.30	4.51
పుంగనూరు	6.31	4.54

నా రైతు.. నా ఆరోగ్యం

ఆరోగ్య రక్షణపై ప్రజల్లో శ్రద్ధ పెరిగింది.. రసాయన రహిత ఆహార ఉత్పత్తులపై అవగాహన వచ్చింది. సేంద్రియ పంటల కొనుగోలుపై ఆసక్తి అధికమైంది.. అయితే ప్రకృతి విధానంలో సాగుచేసిన కూరగాయలు ఎక్కడ లభిస్తాయి..? క్రిమిసంహారకాలు వాడని ఆకు కూరలు ఎక్కడ దొరుకుతాయి..? పురుగు మందుల అవశేషాలు లేని తీగజాతి కాయకూరలు ఎక్కడ లభిస్తాయి..? ఇలాంటి ప్రశ్నలకు ఓ స్వచ్ఛంద సంస్థ సమాధానం ఇస్తోంది. ఇటు రైతుకు గిట్టుబాటు దక్కేలా.. అటు కొనుగోలుదారుడికి సంతృప్తి కల్పించేలా కార్యాచరణ రూపొందించింది. ఇరువురి భాగస్వామ్యంతో చిన్న కమతాల్లో గోఆధారిత సేద్యానికి బాటలు వేసింది. దళారీలతో పనిలేకుండా అన్నదాత – వినియోగదారుడు నేరుగా ఒప్పందం కుదుర్చుకుని లబ్ధి పొందేలా ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసింది. తిరుపతి సమీపంలోని వేమూరు గ్రామంలో సాగుతున్న విశేష వ్యవసాయాన్ని పరిశీలించేందుకు 'సాక్షి' పొలంబాట పట్టింది. సమగ్ర సమాచారంతో ప్రత్యేక కథనం..

- అన్నదాతకు ఆదరువుగా వినియోగదారులు
- గో ఆధారిత ప్రకృతి సేద్యానికి తోడ్పాటు
- నాణ్యమైన పంట ఉత్పత్తులను అందిస్తున్న రైతులు
- 30 సెంట్లలో 20 రకాల కూరగాయల సాగు
- పొలం నుంచి నేరుగా వంటింటికే సరఫరా

యెండ్లూరి మోహన్, సాక్షి తిరుపతి డెస్క్:

ఉరుకులు పరుగుల జీవితం.. ఉన్నది తిని జీవనాధారం కోసం కాయకష్టం చేయాల్సిన పరిస్థితి. ఆరోగ్యంపై అంతగా పట్టించుకునే పరిస్థితులు ఇన్నాళ్లు లేవు. కోవిడ్ దెబ్బకు అందరూ ఆరోగ్యంపై దృష్టి సారించారు. జీవన విధానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన పెంచుకుంటున్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల అవశేషాలు లేని ఆహారం తీసుకునేందుకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. వినియోగదారుల ఆలోచన ఇలా ఉంటే.. తాము పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, డిమాండ్ ఉన్న పంటలను పండించినా, వాటిని ఎలా మార్కెటింగ్ చేసుకోవాలో తెలియక రైతులు అవస్థలు పడుతున్నారు.

వర్డ్ సంస్థ చొరవతో!
రైతుల కష్టాలను, వినియోగదారుల ఆలోచనలను వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్(వర్డ్) సంస్థ వ్యవస్థాపకుడు, జిల్లా వ్యవసాయ బోర్డు సలహా మండలి సభ్యుడు డాక్టర్ గంగాధరం గుర్తించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ, రసాయనిక ఎరువులు లేని ఆహార ఉత్పత్తులను వినియోగదారులకు అందించేందుకు ఒక వేదిక అవసరమని భావించారు. గోఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్న సుభాష్ పాలేకర్ విధానమే ఇందుకు సరైన పరిష్కారమని నిర్ణయించుకున్నారు. దీనిపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. చిన్న కమతాల్లోనే ఎక్కువ రకాల పంటలను తక్కువ ఖర్చుతో పండించవచ్చని ప్రయోగాత్మకంగా నిరూపించారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, ప్రతి నెలా ఆదాయం వచ్చేలా ఒక వ్యవస్థను ఏర్పాటుచేస్తామని భరోసా ఇచ్చారు. ఆరోగ్య రక్షణే ధ్యేయంగా ముందుకు సాగుతున్నారు.



సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన వంగ తోట

రైతు–వినియోగదారుల భాగస్వామ్యం
గోఆధారిత ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించిన తర్వాత గంగాధరం వినియోగదారులపై దృష్టి సారించారు. ఈ మేరకు తిరుపతిలో గత ఏడాది జూన్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రైతులు, వినియోగదారులకు పరస్పరం ఒప్పందం కుదిర్చారు. 20 మంది వినియోగదారులకు నెలకు తమ కుటుంబాలకు అవసరమైన 20 రకాల కూరగాయలను రైతు తన 30 సెంట్ల భూమిలో పండించాలి. అందుకు రైతుకు ప్రతి వినియోగదారుడు నెలకు రూ.1,500 చొప్పున చెల్లిస్తాడు. అంటే నెలకు రూ.30 వేల వరకు చెల్లిస్తారు. ఏడాది పొడవునా ఈ బంధం కొనసాగుతూనే ఉంటుంది. దీనికి రైతు–వినియోగదారుల భాగస్వామ్య పథకం (ఎఫ్‌సీపీ) అని పేరు పెట్టారు.



దత్తత తీసుకున్న పొలంలో వినియోగదారులు



పంటను పరిశీలిస్తున్న వినియోగదారులు

ఏడాదికి రూ.2.4 లక్షల ఆదాయం
ఎఫ్‌సీపీ పథకంలో భాగంగా తిరుపతి రూరల్ మండలం, వేమూరు, కస్తూరికండ్రిగ, రామచంద్రాపురం మండలంలోని రాయలచెరువు తదితర ప్రాంతాల్లో రైతులు గోఆధారిత ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. టమాట, వంగ, మిర్చి, కాకర, బీర, సొరకాయ, గోరుచిక్కుడు, చెట్టు చిక్కుడు, చుక్కకూర, పాలకూర, తోటకూర, చిర్రాకు వంటి 20 రకాలను ప్రతి వారం వినియోగదారులకు అందజేస్తున్నారు. ఆ వారంలో దిగుబడి అయిన కూరగాయలు, ఆకు కూరలను 20 సమ భాగాలుగా చేసి ఒక్కో ప్రత్యేక సంచిలో వేసి ఆటో ద్వారా ప్రతి వినియోగదారుడి ఇంటికే చేర్చుతున్నారు. కేవలం 30 సెంట్ల భూమిలో నెలకు ఖర్చులు పోగా రూ.20వేలు మిగులుతున్నట్లు రైతులు ఆనందంగా చెబుతున్నారు. ఏడాదికి దాదాపు రూ.2.4 లక్షల ఆదాయం వస్తోందని వెల్లడిస్తున్నారు.



సేంద్రియ పద్ధతిలో సాగు చేసిన కూరగాయలను వేరు చేస్తున్న రైతులు

విశేష స్పందన


"తొలి ప్రయత్నంలోనే వినియోగదారులతో ఒప్పందం కుదుర్చుకోవడంతో శ్రమతగ్గింది. గో ఆధారిత సేంద్రియ వ్యవసాయ పద్ధతిని అనుసరించడం వల్ల ఆరోగ్యకర ఆహార ఉత్పత్తులు వస్తున్నాయి. వినియోగదారులు సెలవు రోజుల్లో పంటపొలాలకు వస్తున్నారు.
– గంగాధరం, వర్డ్ సంస్థ ప్రతినిధి, తిరుపతి

సేంద్రియ విధానంలోనే..


దేశీ ఆవుపేడతో సేంద్రియ విధానంలోనే పంటలు పండిస్తున్నాం. 20 మంది వినియోగదారులు ముందు కొచ్చి సాగుకు సాయం అందించారు. వారికి ఆరోగ్యకరమైన, నాణ్యమైన పంట ఉత్పత్తులను అందిస్తున్నాం. పంటను ఎలా అమ్ముకోవాలి అనే ఇబ్బంది తప్పింది.
– వెంకటాద్రి, రైతు, వేమూరు

ఒప్పందంతో సత్ఫలితాలు


వినియోగదారునితో నేరుగా భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకోవడం వల్ల నిశ్చింతగా వ్యవసాయం చేసుకుంటున్నాం. సత్ఫలితాలు పొందుతున్నాం. రోజుకు రెండు గంటలు కష్టపడితే పెట్టుబడి పోగా నెలకు రూ.20వేలు మిగులుతోంది.
– మునిరత్నం నాయుడు, రైతు, కస్తూరికండ్రిగ

నాణ్యమైన కూరగాయలకోసమే..


మాకు అవసరమైన కూరగాయలను సేంద్రియ పద్ధతిలో రైతు సాగుచేస్తున్నాడు. ఎలా చేస్తున్నారో మనమే వెళ్లి చూసుకోవచ్చు. రైతు ఏం చేస్తున్నాడో మనకు వాట్సాప్ గ్రూప్‌లో షేర్ చేస్తున్నాడు. ఇంతకంటే మంచి కూరగాయలు ఇంకెక్కడా దొరకవు.
– టీవీ మనోహర్, వినియోగదారుడు, తిరుపతి

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 1,748 మంది గైర్హాజరు
తిరుపతి ఎడ్యుకేషన్ : ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్ష జరిగింది. ఈ పరీక్షకు మొత్తం 141పరీక్ష కేంద్రాలు కేటాయించగా మొత్తం 51,006 మంది విద్యార్థులు హాజరవ్వాల్సి ఉంది. అయితే వీరిలో 1,748 మంది గైర్హాజరైనట్టు ఆర్‌ఐఓ వీ.రమేష్ తెలిపారు. బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు కెమిస్ట్రీ, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్ష జరుగుతుందని ఆర్‌ఐఓ తెలిపారు.

మహిళా వర్సిటీలో సెలస్ట్రా-23


జాతీయ స్థాయి సాంకేతిక పోటీలకు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అధ్యాపకులు

తిరుపతి ఎడ్యుకేషన్: శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాల సీఎస్‌ఈ విభాగం ఆధ్వర్యంలో సెలస్ట్రా-23 పేరుతో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ స్థాయి సాంకేతిక పోటీలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు దేశ వ్యాప్తంగా పలు ఇంజినీరింగ్ కళాశాలల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. వీరికి రెండు రోజుల పాటు పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, ఐడియా ఎక్స్‌పో, కోడింగ్, బగ్–బ్లస్టర్స్ వంటి పోటీలను నిర్వహించనున్నారు. ముఖ్యఅతిథులుగా జోహో కార్పొరేషన్ సంస్థ లాలెంట్ అక్విజేషన్ మేనేజర్ ఎస్.జీవిత, అసిస్టెంట్ మేనేజర్ పి.రేవతి హాజరై సెలస్ట్రా-23 టెక్‌ఫెస్ట్‌ను ప్రారంభించి మాట్లాడారు. మహిళా వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లికార్జున, సీఎస్‌ఈ విభాగాధిపతి ప్రొఫెసర్ వి.సరిత, కన్వీనర్ డాక్టర్ ఎస్.పద్మజ, కోకన్వీనర్ ఎల్.జయశ్రీ, విద్యార్థి కన్వీనర్ టి.లక్ష్మీలహరి, కోకన్వీనర్ వి.దివ్య పాల్గొన్నారు.

టైటిల్ షో అదిరింది!


కుటుంబ సభ్యులతో కలిసి మిస్ ఇండియా టైటిల్‌ను చూపుతున్న భావన

తిరుపతి కల్చరల్: మిస్ ఇండియా ఐకానిక్ టైటిల్‌ను సాధించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని సీ.భావన తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. చంద్రగిరికి చెందిన తాను పద్మావతి మహిళా వర్సిటీలో ఎంఎస్సీ బయో టెక్నాలజీ చదువుతున్నానని, రన్‌వే షోలపై మక్కువతో 15 రోజుల ముందు ముంబయిలో జరిగిన పోటీలలో ప్రత్యర్థులతో పోటీ పడి టాప్ 20లో విన్నర్‌గా నిలిచి మిస్ ఇండియా ఐకానిక్ టైటిల్‌ను సాధించినట్టు వెల్లడించారు. టైటిల్ సాధించడంలో తన తల్లిదండ్రుల సహకారం మరువలేనని పేర్కొన్నారు. భావన తల్లి లక్ష్మి, తండ్రి గోపీకృష్ణ, తమ్ముడు దరహాస్ పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.44 కోట్లు


శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామికి రూ.1.44 కోట్లు హుండీ ఆదాయం లభించినట్టు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. ఈనెల 1 నుంచి 27వ తేదీ వరకు ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను ఆలయ సిబ్బంది మంగళవారం లెక్కించారు. ఆమేరకు నగదు రూపంలో రూ.1,44,99,622 ఆదాయం వచ్చినట్టు తెలిపారు. బంగారు 74.100 గ్రాములు, వెండి 472.162 కేజీలు, విదేశీ కరెన్సీ 71 నోట్లు భక్తులు సమర్పించారన్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చక్రస్నానం..పులకించిన భక్తజనం

- ధ్వజావరోహణంతో ముగిసిన కోదండరాముడి వార్షిక బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం ఉదయం కపిలతీర్థంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఉదయం శ్రీలక్ష్మణ సీతారాములవారు పల్లకీని అధిరోహించి ఊరేగింపుగా కపిలతీర్థానికి వేంచేశారు. అనంతరం ఉత్సవమూర్తులకు శ్రీవేణుగోపాలస్వామి వారి ఆలయ మండపంలో స్నపన తిరుమంజనం చేపట్టారు. ఇందులో సీతారామలక్ష్మణ సరసన చక్రత్తాళ్వార్లు పాలు, పెరుగు, కొబ్బరినీళ్లు, పసుపు, చందనం పండ్ల రసాలతో అభిషేకాలు అందుకొని ప్రసన్నులయ్యారు. అర్చకుల వేద మంత్రోచ్చారణ నడుమ శాస్త్రోక్తంగా పుష్కరిణిలో చక్రస్నానం నిర్వహించారు. తర్వాత అక్కడి నుంచి స్వామివారు శ్రీగోవిందరాజస్వామి ఉన్నత పాఠశాలలోని పీఆర్ తోటకు వేంచేశారు. సాయంత్రం అక్కడి నుంచి బయలుదేరి తీర్థకట్ట వీధి, కోటకొమ్మల వీధి, కొత్త వీధి మీదుగా శ్రీకోదండరామాలయానికి చేరుకున్నారు. మధ్యలో శ్రీఆంజనేయస్వామివారి ఆలయం, శ్రీవైఖానసాచార్యుల ఆలయంలో ఆస్థానం నిర్వహించారు. రాత్రి ధ్వజావరోణ ఘట్టం చేపట్టడంతో స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో తిరుమల పెద్ద జీయర్ స్వామి, చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ మోహన్, కంకణభట్టర్ ఆనందకుమార్ దీక్షితులు, సూపరింటెండెంట్ రమేష్‌కుమార్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు సురేష్, చలపతి పాల్గొన్నారు.



కోనేరులో చక్రత్తాళ్వారుకు అవబృథస్నానం చేయిస్తున్న అర్చకులు

తిరుపతి సబ్ రిజిస్ట్రార్ బదిలీ
తిరుపతి అర్బన్: తిరుపతి జాయింట్–1 సబ్ రిజిస్ట్రార్ జీ.శివకుమారి ని డెప్యూటేషన్‌పై తిరుమల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి బదిలీ చేశారు. తిరుమలలో మ్యారేజ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న బీ.కోమలాదేవిని తిరుపతి జాయింట్–1 రిజిస్ట్రార్‌గా నియమించినట్లు జిల్లా రిజిస్ట్రార్ పీవీఎస్ బాబు మంగళవారం వెల్లడించారు. అయితే జీ.శివకుమారి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఒక డాక్యుమెంట్‌ను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపణలు రావడంతో అందులో భాగంగానే ఆమెను బదిలీ చేసినట్లు చర్చ సాగుతోంది.

కోవిడ్ టెస్ట్‌లకు ఆదేశం
చిత్తూరు రూరల్: కోవిడ్ మహమ్మారి మళ్లీ విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం అప్రమత్తమైంది. జిల్లాలో రోజూ కనీసం కోవిడ్ నిర్ధారణ పరీక్షలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై అధికారులు మాట్లాడుతూ ప్రస్తుతం రోజూ 20 నుంచి 30 ర్యాపిడ్ పరీక్షలు చేయిస్తున్నామని, ఎక్కడా పాజిటివ్ కేసులు నమోదు కావడం లేదని తెలిపారు.

సమస్యలు పరిష్కరిస్తాం..
ఉద్యోగులకు అండగా ఉంటాం

- ఆర్టీసీ అభివృద్ధిలో అందరూ భాగస్వాములే
- తిరుపతిలో తొలి సీసీఎస్ రాష్ట్ర స్థాయి సర్వసభ్యసమావేశం
- ఆర్టీసీకి చెందిన పలు అంశాలపై తీర్మానం



మాట్లాడుతూ ఆర్టీసీ ఎండీ, సీసీఎస్ పాలక మండలి చైర్మన్ ద్వారక తిరుమలరావు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ అభివృద్ధిలో ప్రతి ఉద్యోగి భాగస్వాములు కావాలని ఆ సంస్థ ఎండీ, సీసీఎస్ పాలకవర్గ మండలి చైర్మన్ ద్వారకా తిరుమలరావు పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్ ప్రాంతం, రామచంద్రాపురం మండలం, చిగురువాడ నిషాల్ కన్వెన్షన్ హాల్‌లో సీసీఎస్ (క్రెడిట్ కో–ఆపరేటివ్ సొసైటీ) మూడో సమావేశాన్ని తొలిసారిగా తిరుపతి జిల్లాలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీకి చెందిన ఉద్యోగులు హాజరయ్యారు. ముందుగా సీసీఎస్ పాలకవర్గ మండలి చైర్మన్, ఆర్టీసీ ఎండీతోపాటు సీసీఎస్ వైస్ చైర్మన్, ఈడీఏ కోటేశ్వరరావు, సెక్రటరీ దాసు, ఈడీ గోపీనాథ్‌రెడ్డి, డీపీటీఓ చెంగల్‌రెడ్డికి సీసీఎస్ సభ్యులు (డెలిగేట్స్) స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ద్వారక తిరుమలరావు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు మంచిచేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉందని, ఉద్యోగుల సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే ప్రభుత్వంతో చర్చించి వాటికి పరిష్కారం చూపుతామని వివరించారు. ఆర్టీసీ ఉద్యోగులకు ఎప్పుడూ అండగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీసీఎల్ పాలకవర్గ మండలి సభ్యులు శ్రీనివాసరాజు, అనంతరావు, వినోద్‌బాబు, గోపాల్, శేఖర్‌తోపాటు 220 మంది ఉద్యోగులు పాల్గొన్నారు. మరోవైపు ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలు సత్యనారాయణ, అవుల ప్రభాకర్‌యాదవ్, రెడ్డెప్ప, పెరుమాళ్, బీఎస్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు
- ఎడ్యుకేషన్ రుణాలు రూ.5.5 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంపు
- రిమూవల్ అయిన ఉద్యోగి మృతి చెందితే రుణాలను రైట్ ఆఫ్ చేయడం
- అసోసియేట్ డిపాజిట్ సేకరణ బదులుగా వీఎంఆర్‌డీఎఫ్‌కి చెందిన కొత్త పథకం ద్వారా ప్రతి నెలా సేకరణ చేసి విరమణ సమయంలో డిపాజిట్ చేసేలా మార్పు

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం
తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి జిల్లా పరిధిలోని 5 కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయాల్లో 2023–24లో 6, 11 తరగతుల్లో నూతన ప్రవేశాలకు ఆన్‌లైన్లో దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. అలాగే 7, 8, 9 తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఆసక్తి ఉన్న బాలికలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీలోపు అనాథలు, బడి బయట పిల్లలు, డ్రాపౌట్స్ (బడి మానేసిన వారు), పేద విద్యార్థినులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తుకు అర్హులని, ఆన్‌లైన్లో వచ్చిన దరఖాస్తులనే అడ్మిషన్లకు పరిగణిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు "ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్" వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన బాలికలకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని, పూర్తి వివరాలకు సమగ్రశిక్ష కార్యాలయాన్ని నేరుగా గానీ లేదా 94418 63994 నంబర్లో సంప్రదించాలని డీఈఓ కోరారు.

క్లుప్తంగా

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిల్లకూరు: మండలంలోని జాతీయ రహదారి బూదనం టోల్ ప్లాజా దాటిన తర్వాత పట్రగుంట సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు మంగళవారం పోలీసులకు సమాచారం అందడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. రహదారికి పక్కనే మృతి చెంది ఉన్నట్లు వారు గుర్తించారు. మృతుని వయసు సుమారు 55–60 ఏళ్ల మధ్య ఉంటుందని, అతని మెడలో రుద్రాక్షాలు ధరించి ఉన్నాడని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ నారపరెడ్డి తెలిపారు.

పాడుబడ్డ బావిలో..

పాకాల : గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మంగళవారం స్థానిక పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని ఆదినపల్లి పంచాయతీ, అనంతఆంజనేయస్వామి ఆలయానికి సమీపంలోని పాడు బడ్డ డాబాలో వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోలీసులు పరిశీలించి, పది రోజుల ముందే సదరు వ్యక్తి మృతిచెంది ఉండొచ్చని, అతని వయసు 25–30 ఏళ్ల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. మృతిగల కారణాలు తెలియాల్సి ఉందని సీఐ రాజశేఖర్ తెలిపారు.

అత్తింటి నుంచి గెంటేశారు!

నాయుడుపేటటౌన్ : 'వివాహమై పాప పుట్టినప్పటి నుంచి భర్తతో పాటు అత్త, ఆడపడుచులు అదనపు కట్నం కోసం వేధింపులకు గురిచేస్తున్నారు. అంతేకాకుండా అత్తింటి నుంచి కూడా గెంటేశారు'అని బాధితురాలు మంగళవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం.. పట్టణంలోని విన్నమాల రోడ్డు వద్ద నివాసం ఉంటున్న దుర్గాప్రసాద్ అనే డ్యాన్సర్, అదే ప్రాంతానికి చెందిన కాశీ కృష్ణవేణితో 2021లో వివాహమైంది. వీరికి పాప ఉంది. ఇదిలావుండగా తరచూ అదనపు కట్నం కోసం భర్త దుర్గాప్రసాద్‌తో పాటు అత్త జ్యోతి, చిన్నత్త ఎర్రమల్లి, ఆడపడుచు నందిని చిత్ర హింసలు పెట్టినట్లు బాధితురాలు ఫిర్యాదులో పెర్కొంది. అంతేకాకుండా 2023 ఫిబ్రవరి 18వ తేదీన ఇంటి నుంచి గెంటేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు పేర్కొన్నారు.

ఆలయంలోకి ప్రవేశిస్తున్న సూర్యకిరణాలు



వేదనారాయణ స్వామి తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు





పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న శ్రీదేవి, భూదేవి సమేత వేదనారాయణ స్వామి

ఆదిత్య అనుబంధం!

- వేదనారాయణుని శిరస్సును స్పృశించిన సూర్యకిరణాలు
- నాగలాపురంలో సూర్యపూజ తెప్పోత్సవాలు పరిసమాప్తం

పిచ్చాటూరు: నాగలాపురంలో సూర్యపూజ తెప్పోత్సవాల్లో చివరి రోజైన మంగళవారం సాయంత్రం శ్రీ వేదనారాయణ స్వామి శిరస్సును స్పృశిస్తూ వెచ్చదనాన్ని అందించేలా సూర్యకిరణాలు తాకాయి. సాయంసంధ్యా వేళ భాస్కర తేజాలు ఆలయ ద్వార గోపురం, బలిపీఠం, ధ్వజస్తంభం గుండా మెల్లగా గర్భాలయంలోకి ప్రవేశించాయి. 650 అడుగుల దూరంలోని మూలవిరాట్ శిరస్సుపై ప్రసరించాయి. భక్తులు ఈ అద్భుత దృశ్యాన్ని చూసి పులకించిపోయారు. కిరణాలు స్వామివారి శిరస్సును తాకిన వెంటనే భక్తుల గోవిందనామస్మరణ హెరెత్తింది. అనంతరం మంత్రయుక్త జలంతో పరిచారికలు, అర్చకులు కిరణ ప్రసార మార్గాన్ని అభిషేకించి స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం స్నపన తిరుమంజనాన్ని వేడుకగా చేపట్టారు.

వేడుకగా తెప్పోత్సవం

సాయంత్రం సూర్యపూజ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేదనారాయణస్వామి ఉత్సమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి తిరుచ్చిపై ఆశీనులు చేసి పుష్కరిణికి వేంచేపు చేశారు. పుష్కరిణిలోని తెప్పపై స్వామి, అమ్మవార్లు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి నిజాలయంలో శ్రీ వేదనారాయణుడికి ఏకాంత సేవ నిర్వహించారు. దీంతో ఈ ఏడాది సూర్యపూజ తెప్పోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. కోవిడ్ కారణంగా మూడేళ్ల తరువాత సూర్యపూజ తెప్పోత్సవాలు నిర్వహించడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సత్యవేడు సీఐ శివకుమార్‌రెడ్డి, ఎస్ఐలు హనుమంతప్ప, శ్రీకాంత్‌రెడ్డి, పురుషోత్తం రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

పరిశ్రమల వార్షిక సర్వే రిటర్న్ దాఖలుపై వర్క్‌షాప్



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న ఏఎస్ఎస్ఎం రావు

వరదయ్యపాళెం: పరిశ్రమల వార్షిక సర్వే (యాన్యువల్ సర్వే ఆఫ్ ఇండస్ట్రీస్ – ఏఎస్ఐ) రిటర్న్‌ల స్వయం సహాయక దాఖలు పద్ధతిని వివరించడానికి, కేంద్ర గణాంకాల మంత్రిత్వ శాఖ పరిధిలోని కేంద్ర గణాంకాల కార్యాలయం (ఫీల్డ్ ఆపరేషన్స్ డివిజన్), కడప ఆధ్వర్యంలో మంగళవారం శ్రీసిటీలో వర్క్‌షాప్ జరిగింది. ఇందులో సంబంధిత పోర్టల్‌లో రిటర్న్‌ల దాఖలకు అవసరమైన డేటా సేకరణ, ఇతర ప్రక్రియలను వివరించారు. శ్రీసిటీలోని అన్ని పరిశ్రమల అకౌంట్స్ మేనేజర్లు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్‌కుమార్ నిర్వాహకులకు, వర్క్‌షాప్‌లో పాల్గొన్న వారికి సాదర స్వాగతం పలికారు. రీజినల్ డైరెక్టర్ ఏఎస్ఎస్ఎం.రావు వర్క్‌షాప్ ఉద్దేశాన్ని వివరించడంతో పాటు పరిశ్రమల సామర్థ్యాన్ని రిపోర్ట్ రూపంలో అందుబాటులోకి తేవడానికి ఏఎస్ఐ ఉపయోగపడుతుందన్నారు. ఏఎస్ఎస్ఎం.రావుతో పాటు సీనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు జి.శ్రీనివాసరావు, ప్రశాంతి ఏఎస్ఐ పోర్టల్‌లో దశలవారీగా డేటాను ఎలా పూరించాలో వివరించారు.

నేడు హరేకృష్ణ నేత్రాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రూపేష్ చైతన్య ప్రభుదాస్

తిరుపతి కల్చరల్: జిల్లాలోనే గాక రాష్ట్ర వ్యాప్తంగా పేదలందరికీ ఆధునిక కంటి వైద్య చికిత్సలను ఉచితంగా అందించే లక్ష్యంగా ఇస్కాన్ ఆధ్వర్యంలో ఎయిర్ బైపాస్ రోడ్డు, లక్ష్మీపురం సర్కిల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన హరేకృష్ణ నేత్రాలయాన్ని బుధవారం ఉదయం ప్రారంభించనున్నట్లు ఇస్కాన్ ఉపాధ్యక్షుడు రూపేష్ చైతన్యదాస్‌ప్రభు తెలిపారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆ వివరాలు వెల్లడించారు. సుమారు రెండు లక్షల రూపాయల ఖర్చుతో కూడిన కంటి ఆపరేషన్లు సైతం కేవలం రూ.40 వేలకే అందించనున్నట్లు తెలిపారు. ఇస్కాన్ కార్యదర్శి, పీఆర్‌ఓ లీలాపారాయణ దాస్, కృష్ణకిశోర్, నవగౌరవ ప్రభుదాస్, భలభద్ర ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణకు ముందే సమాచారం ఇవ్వాలి





మాట్లాడుతున్న చంద్రమౌళిసింగ్, తమ వివరాలను అందజేస్తున్న విశ్రాంత ఉద్యోగులు

- నామినీ వివరాలు స్పష్టంగా చెప్పాలి
- కలెక్టరేట్‌లో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్

తిరుపతి అర్బన్: ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణకు ఆరు నెలలు ముందే పూర్తి వివరాలను డీడీవో నేతృత్వంలో రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి పంపాలని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ సి.చంద్రమౌళిసింగ్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో పెన్షన్, జీపీఎఫ్ అదాలత్ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ ఏజీ, డైరెక్టరేట్ ఆఫ్ ట్రెజరీ ఏపీ వారు సంయుక్తంగా నిర్వహించారు. ముందుగా ఆయన కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డిని కలిసి అనంతరం సమావేశానికి హాజరయ్యారు. ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ మాట్లాడుతూ పదవీ విరమణ చేయబోయే ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ దరఖాస్తులను సకాలంలో పూర్తి వివరాలతో తమకు పంపాలని సంబంధిత డీడీఓలను ఆదేశించారు. ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్ నామినీ, మిస్సింగ్ క్రెడిట్స్ తదితర సమస్యలను త్వరితగతన పరిష్కరిష్కరించడానికి ఈ అదాలత్ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జిల్లాలో పలువురు ప్రభుత్వ పెన్షన్ ఉద్యోగులు నామినీ వివరాలను నమోదు చేసుకోలేదని తెలిపారు. భవిష్యత్తులో వారికి రావాల్సిన బెనెఫిట్లకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా జీపీఎఫ్ ఖాతాలకు ఉద్యోగి నామినీ వివరాలను రికార్డులలో నమోదు చేసుకోవాలని స్పష్టం చేశారు. డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ బనోత్ రాకేశ్‌నాయక్ మాట్లాడుతూ పెన్షనర్లకు సంబంధించి పూర్తి స్థాయిలో ఉన్న ప్రతిపాదనలను, గ్రీవెన్స్‌లను 31 రోజుల్లోపు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పదవీ విరమణ పొందిన 25 మంది ఉద్యోగుల పెన్షన్ మంజూరు పత్రాలను, ఫైనల్ జీపీఎఫ్ మంజూరు పత్రాలను అందజేశారు. పెన్షన్, జీపీఎఫ్ అదాలత్‌లో 50 అర్జీలు అందాయని, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపడతామన్నారు. సీనియర్ డీఏజీ సాయి గాంధీ, టి.విజయ్‌కుమార్ తిరుపతి జిల్లా ట్రెజరీ అధికారి లక్ష్మీకర్ రెడ్డి, ఏటీఓ ప్రసాద్, డీడీవోలు పాల్గొన్నారు.

జేసీబీ, ట్రాక్టర్ సీజ్

ఏర్పేడు: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి మంగళవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మండలంలోని గోవిందవరం సమీపంలో స్వర్ణముఖి నది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు వివరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి

- 51 పరిశ్రమలకు రూ.5.12 కోట్లు ఆమోదం



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కార్మికులకు ఇబ్బందులు లేకుండా పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఉపాధి కార్యక్రమం ద్వారా కేవీఐసీలను సమీక్షిస్తూ లక్ష్య సాధనలో పురోగతి చూపాలన్నారు. సింగిల్ డెస్క్ విధానంలో జిల్లా ఏర్పడిన నాటి నుంచి 541 పరిశ్రమలకు గాను 514 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామన్నారు. మరో 16 పరిశ్రమలకు సంబంధించి పరిశీలనలో ఉన్నాయన్నారు. పరిశ్రమల పరిశీలన కమిటీకి అందిన మేరకు 51 పరిశ్రమలకు ప్రోత్సాహకాలుగా రూ.5.12 కోట్లు అందించడానికి ఆమోదం లభించిందని తెలిపారు. పెట్టుబడి సబ్సిడీ 30, విద్యుత్ సబ్సిడీ 14, వడ్డీ రాయితీ 2, స్టాంప్ డ్యూటీ 1, ల్యాండ్ కాస్ట్ 1, సేల్స్ టాక్స్ 3 యూనిట్లకు ఆమోదించామని వెల్లడించారు. క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఏర్పేడు మండలం, మధవమాల కింద వుడ్ కార్వింగ్ క్లస్టర్, రేణిగుంట మండలం, ఎర్రమరెడ్డిపాళెంలో కాపర్ వేజెల్స్ క్లస్టర్ వెంకటగిరి శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్, నారాయణవనంలో పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించారు. తిరుపతి జిల్లా నుంచి పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతులు జనవరి 2023 నాటికి దాదాపుగా రూ.14,176 కోట్లు ఉందని పేర్కొన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్‌రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి సుహానాసోని, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ రామకృష్ణారెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ రమణయ్య, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ నరేంద్ర, ఉప కార్మిక లేబర్ కమిషనర్ బాలు నాయక్ పాల్గొన్నారు.

బ్యాంకర్లు వందశాతం రుణాలు ఇవ్వాలి

వార్షిక రుణ ప్రణాళిక మేరకు బ్యాంకర్లు వంద శాతం రుణాలను మార్చి 31వ తేదీలోపు ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమీక్ష కమిటీ (డీఎల్ఆర్‌సీ) 2022–23 ఆర్థిక సంవత్సర మూడవ త్రైమాసిక సమీక్ష సమావేశం చైర్మన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుభాష్‌తో కలిసి నిర్వహించారు. జిల్లా అధికారులతోపాటు, ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకర్లతో వార్షిక రుణ ప్రణాళిక 2022–23 అమలుపై మూడవ త్రైమాసికానికి సంబంధించి వివిధ రంగాలకు చెందిన రుణాల మంజూరు, గ్రౌండింగ్ పురోగతిపై వర్చువల్ విధానంలో సమీక్ష నిర్వహించారు.

నమ్మాళ్వార్‌ను దర్శించుకున్న చిన్నజీయర్‌స్వామి

- శిథిలమైన ఆలయాన్ని బాగుచేయాలన్న అర్చకులు
- టీటీడీ దృష్టికి తీసుకెళతానన్న స్వామిజీ



నమ్మాళ్వార్ ఆలయ ఆధునికీకరణపై చర్చిస్తున్న త్రిదండి చిన్నజీయర్‌స్వామి

తిరుపతి కల్చరల్: త్రిదండి చిన్నజీయర్‌స్వామి మంగళవారం తిరుపతి కపిలతీర్థం వద్దకు చేరుకుని నమ్మాళ్వార్‌ను దర్శించుకున్నారు. అనంతరం నమ్మాళ్వార్ ఆలయానికి వెనుక భాగాన శిథిలమైన పురాతన కట్టడాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జీయర్ స్వామికి అక్కడి అర్చకులు నమ్మాళ్వార్ ఆలయం శిథిలమైనప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని, పురాతన ఆలయాన్ని బాగు చేయించాలని అభ్యర్థించారు. దీంతో స్వామీజీ శ్రీవారి సేవలో ఆళ్వార్లు చేసిన గొప్ప త్యాగాల గురించి వివరిస్తూ టీటీడీ ఆధ్వర్యంలో నమ్మాళ్వార్ పురాతన ఆలయాన్ని బాగు చేయించేలా చూడాలని తన వెంట వచ్చిన టీటీడీ పాలకమండలి సభ్యులు రామేశ్వరరావు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలకు సూచించారు. ఈ విషయంపై దేవస్థానానికి ఒక వినతి పత్రం కూడా పంపాలని అక్కడి అర్చకులకు సూచించారు. పురాతన ఆలయాన్ని బాగు చేయించేందుకు వచ్చే పాలకమండలి సమావేశంలో చర్చిస్తామని రామేశ్వరరావు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అర్చకులకు హామీ ఇచ్చారు. అనంతరం ప్రస్తుతం పూజలు అందుకునే నమ్మాళ్వార్ ఆలయంలో దర్శనం చేసుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.60,840
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,434

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.71,300
రిటైల్ వెండి గ్రాము	రూ.73.30

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	24
తిరుమల	32	20
చిత్తూరు	36	24
గూడూరు	37	26
నగరి	37	24

హుండీ ఆదాయం రూ. 52.76 లక్షలు



కానుకల లెక్కింపును పరిశీలిస్తున్న చైర్మన్, ఈఓ

సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి ఆలయ హుండీ ఆదాయం రూ.52.76 లక్షలు వచ్చినట్టు చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. జిల్లా దేవదాయ అధికారి పీ రామకృష్ణ పర్యవేక్షణలో మంగళవారం రెండు నెలల 23 రోజులకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించగా అందులో రూ.52,76,010 లక్షల నగదు వచ్చిందన్నారు. దీంతోపాటు యూఎస్ఏ డాలర్లు 255, యూఏఈ దిరహమ్స్ 205, ఒమన్ దేశానికి చెందిన 2 బైసాలు, సౌదీకి చెందిన 50 రియాల్స్ వచ్చినట్టు వెల్లడించారు. అదేవిధంగా అన్నదానానికి రూ.61,612 వేలు వచ్చిందన్నారు. రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, ఆలయ పాలకమండలి సభ్యులు ఎం చంద్రశేఖర్ రెడ్డి, వంకా దినేష్‌కుమార్, బండి సునీత, మన్నెముద్దు పద్మజ, నాయుడుకుప్పం నాగమణి, మాజీ సభ్యులు ముంగర అమరావతి పాల్గొన్నారు.

అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న డీన్ తదితరులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల పరిధిలోని అగ్రిబిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రతిభకనబరిచారు. ఆ వివరాలను వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 24, 25 తేదీల్లో పూణేలోని వైకుంఠ మెహతా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కో–ఆపరేటివ్ మేనేజ్‌మెంట్‌లో స్పార్ధ–2023 పేరుతో నిర్వహించిన వివిధ ఈవెంట్లలో తమ విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. బిజినెస్ క్విజ్ పోటీల్లో సాయిసుబ్రమణ్యం, యూనస్‌లు మొదటి స్థానం సాధించారని, సింగింగ్‌లో మధుమిత తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు. తమ విద్యార్థులు జాతీయ స్థాయి పోటీల్లో బహుమతులు సాధించడం అభినందనీయమని పేర్కొన్నారు. వీరిని అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ కె.సత్యగోపాల్, డాక్టర్ ప్రభావతి, డాక్టర్ కృష్ణకిషోర్, డాక్టర్ సామ్యులు అభినందించారు.

ఇంజెక్షన్ వికటించి వ్యక్తి మృతి?

– సూది మందు కారణం కాదంటున్న వైద్యుడు



మృతి చెందిన శ్రీనివాసులు

సైదాపురం: ఆర్ఎంపీ ఇంజెక్షన్ కాసేపటికి చికిత్స పొందిన వ్యక్తి మృతి చెందాడు. ఇంజెక్షన్ వికటించడం వల్లే మృతి చెందాడని అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ సంఘటన మండల కేంద్రమైన సైదాపురంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు అందించిన వివరాల మేరకు.. మండలంలోని లింగసముద్రం గ్రామానికి చెందిన తాడి శ్రీనివాసులు(50) ఇరవై రోజుల క్రితం కాలికి దెబ్బతగిలింది. సైదాపురంలోని ఆర్ఎంపీ వైద్యుడు ప్రసాద్ అనే వ్యక్తి వద్దకు వచ్చి వైద్యం చేయించుకున్నాడు. ఈక్రమంలో మంగళవారం రోజు కూడా శ్రీనివాసులు తమ స్వగ్రామం నుంచి సైదాపురంలోని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు చేరుకున్నాడు. కాలికి తగిలిన దెబ్బ వాపు నయం చేయాలని కోరారు. దీంతో వైద్యుడు సమీపంలోని మెడికల్ షాపు నుంచి ఓ ఇంజెక్షన్ తీసుకుని రమ్మని రాసి ఇచ్చారు. బాధతుడి కుటుంబ సభ్యులు ఆ ఇంజెక్షన్ తెచ్చి ఇచ్చారు. ఆర్ఎంపీ ఆ ఇంజెక్షన్‌ను వేసిన కొద్దిసేపటికే శ్రీనివాసులు వాంతులు కావడంతో పాటు అక్కడికక్కడే పడిపోయాడు. శ్రీనివాసులు మృతి చెందినట్లు కుటుంబసభ్యులు నిర్ధారించుకున్నారు. దీంతో మృతుడి కుమారుడు తాడి శంకరయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇంజెక్షన్ వికటించడం వల్లే మృతి చెందాడని అతని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కేసు నమోదు చేసి సమగ్ర విచారణ చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కాగా ఆర్ఎంపీని వివరణ కోరగా తాను యాంటీ బయాటిక్ ఇంజెక్షన్ ఇచ్చానని, దానివల్ల చనిపోయే అవకాశం లేదన్నారు. శ్రీనివాసులు మృతి చెందడానికి వేరే కారణం ఏదైనా ఉంటుందని తెలిపారు.